



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ మను చౌదరి



ఏటీసీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

ఉపాధి కల్పనే లక్ష్యంగా ఏటీసీల నిర్మాణం

ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

దుద్యాల/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం దుద్యాల మండలం హకీంపేట్‌లో నిర్మించే ఆధునాతన ఏటీసీ కేంద్రానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఏటీసీలను ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.400 కోట్లతో ఏటీసీ, ఐటీఐలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రూ.7.20కోట్లతో హకీంపేట్‌లో చేపట్టే ఆధునాతన సాంకేతిక కేంద్రం యువత భవిష్యత్తును మార్చే విధంగా ఉంటుందన్నారు. భవన నిర్మాణమే కాకుండా ఆధునాతన యంత్రాల కొనుగోలుకు రూ.36 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో యువతను ప్రోత్సహిస్తూ ఏటీసీల్లో చేరే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఇండస్ట్రీస్ జోనల్ మేనేజర్ కవిత, ఏటీసీ కన్వీనర్, ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, శ్యామ్‌సుందర్, తహసీల్దార్ కిషన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జనాలకు సర్వం సిద్ధం

భారీ క్రేన్లు, సీసీ కెమెరాలు, లైటింగ్, బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

8

సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. 2014, జూన్ 2వ తేదీ కంటే ముందు తెల్ల కాగితాలపై భూ యాజమాన్య హక్కులను మార్చుకున్న వారు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 2020లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 112 అమలును నిలిపివేస్తూ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఇటీవల ఎత్తేసింది. ఫలితంగా చాలా కాలంగా ఎదురు చూస్తున్న దరఖాస్తుదారుల నిరీక్షణకు త్వరలో తెరపడనుంది. అయితే పట్టా పాస్ పుస్తకాలు జారీ చేసేందుకు మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంకా జారీ చేయలేదు.



క్రమబద్ధీకరణపై ఆశలు

సాదాబైనామాలకు త్వరలో మోక్షం

- నాలుగున్నరేళ్లుగా దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- భూ భారతి చట్టంతో మార్గం సుగమం
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో చిగురిస్తున్న ఆశలు
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,443 దరఖాస్తులు



మండలాల వారీగా దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
కులకచర్ల	505
బషీరాబాద్	181
బొంరాస్‌పేట	315
ధారూరు	203
దోమ	417
దౌల్తాబాద్	315
కొడంగల్	151
కోట్‌పల్లి	139
మర్పల్లి	211
మోమిన్‌పేట	298
నవాబుపేట	136
పరిగి	223
పెద్దేముల్	315
పూడూరు	136
తాండూరు	246
వికారాబాద్	405
యాలాల్	166
బంట్వారం	81

వికారాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెల్ల కాగితాలపై రాసుకున్న భూక్రయ, విక్రయాలకు చట్టబద్ధత కల్పించి రిజిస్ట్రేషన్లు చేసి పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని గత ప్రభుత్వం 2020 అక్టోబర్, నవంబర్ నెలల్లో దరఖాస్తులు స్వీకరించింది. 2014, జూన్ 2వ తేదీలోగా సాదా కాగితాలపై భూములను కొనుగోలు చేసిన రైతుల దరఖాస్తులకు చట్టబద్ధత కల్పించి వారికి పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. 2020, సెప్టెంబరు 12 నుంచి అక్టోబరు 10 వరకు స్వీకరించిన దరఖాస్తుల్లో కొన్నింటిపై అప్పట్లో రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. జిల్లాలో సాదాబైనామా క్రమబద్ధీకరణ కోసం జిల్లాలో 4,443 దరఖాస్తులు రాగా, వాటిలో వివాదాలు ఉన్న దరఖాస్తులు మినహా

మిగతా 8వ పేజీలో...

56 నెలలుగా ఎదురుచూపు

సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 56 నెలలుగా ఎదురు చూపులు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడు సంవత్సరాలు, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదిన్నర పైగానే ఎదురు చూడాల్సి వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారిగా 2016లో సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపట్టింది. అయిదెకరాల లోపు వ్యవసాయ భూములకు ఉచితంగా పట్టామార్పిడి చేశారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం తీసుకోలేదు. అయితే అయిదెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూములకు మాత్రం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని క్రమబద్ధీకరించి పట్టామార్పిడి చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్తగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకు రావడంతో సాదాబైనామాలకు క్రమబద్ధీకరించేందుకు మార్గం సుగమమైంది. భూభారతి చట్టంలోని సెక్షన్-6 ద్వారా క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

కీసర, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. కీసరరగుట్ట లోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కావాల్సిన అన్నీ వసతులు కల్పిస్తాం.. చదువుల్లో, క్రీడల్లో రాణించాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు నమ్ము రావాడంతో, అదనపు గదుల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. వంటగదిలోకి కోతులు వస్తుండటంతో తీవ్ర ఇబ్బంది కలుగుతుందని సిబ్బంది తెలుపగా, వెంటనే గ్రీల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయకుమారి, ప్రధానోపాధ్యాయుడు నరసింహ తహసీల్దార్ అశోక్, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సెలవుల్లో వికారాబాద్ కలెక్టర్

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు



రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనిపై మంగళవారం నుంచి పదిహేను రోజుల పాటు ఆయన సెలవులో ఉండనున్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణరెడ్డి ఇంతకు ముందు వికారాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో పరిపాలనా పరంగా సౌలభ్యంగా ఉంటుందని ప్రభుత్వం ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది.

కొడంగల్‌లో ఇందిరమ్మ క్యాంటీన్

కొడంగల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో ఇందిరమ్మ క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టు ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఇందిరమ్మ క్యాంటీన్ కోసం ఏర్పాట్లను బుధవారం ట్రస్టు సభ్యులు పరిశీలించారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ క్యాంటీన్‌లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాన్ని రూ.5కే అందిస్తామన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించాలి

పూడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు సోకకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో లలితాదేవి సూచించారు. పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సరిపడా మందులు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. రోగులపట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, అసభ్యంగా ప్రవరించరాదని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మహ్మద్ ఇక్బాల్, పీహెచ్ఎన్ సయిదాబీ, ఫార్మసిస్ట్ జి. రవికుమార్, సిబ్బంది మహ్మద్ సజ్జద్‌అలీ తదితరులు ఉన్నారు.



ఘట్‌కేసర్ బల్దియా పరిధిలో పులిచర కుంట పరిధిలో వెలసిన అక్రమ లేఅవుట్

- గతంలో లే అవుట్‌ను తొలగించిన బల్దియా అధికారులు
- మళ్లీ పనులు ప్రారంభించిన అక్రమార్కులు
- ప్లాట్లు కొని మోసపోతున్న అమాయకులు
- ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇష్టారాజ్యం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఎఫ్‌టీఎల్‌లో అక్రమ లేఅవుట్

పులిచర కుంటలో ప్లాట్లు.. విక్రయాలు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరానికి కూతవేటు దూరంలోని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్థలాల ధరలు ఆకాశానంటడంతో అక్రమార్కులు అడ్డదారుల్లో అక్రమార్జనలకు దిగుతున్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, బఫర్ స్థలాల్లో లేఅవుట్లు చేసి అమాయకులకు ప్లాట్లు అంటగట్టి అందిన కాడికి దండుకుంటున్నారు. దాదాపు 30ఏళ్ల క్రితమే ఘట్‌కేసర్ మండలం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉంది. అయినా పాత తేదీలతో ఎప్పుడో మృతి చెందిన సర్పంచుల సంతకాలతో అక్రమ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. 2015 వరకు వ్యవసాయం చేసిన భూమి ఉన్నప్పటికీ 1969లో లేఅవుట్ అయినట్లు పత్రాలు సృష్టించడండంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధి చందుపట్లగూడలోని పులిచర కుంటలో సర్వే నంబర్ 221లో ఎఫ్‌టీఎల్



లేఅవుట్ చేసిన స్థలంలో వరద నీరు(ఫైల్)

మిగతా 8వ పేజీలో...

చర్యలు తీసుకుంటాం



పులిచర కుంటలో నిర్మిస్తున్న లేఅవుట్‌కు సంబంధించిన విషయం మా దృష్టికి వచ్చింది. ఆ లేవుట్‌కు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. త్వరలోనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. చెరువుల్లో, కుంటల్లో లేఅవుట్లు చేసి ప్లాట్లు విక్రయించే రియల్టర్లు, వ్యాపారుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-రాజేశ్, కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్



35,172 కొత్త రేషన్ కార్డులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పెరిగిన లబ్ధిదారుల సంఖ్య

ఈ నెల నుంచి చౌకధరల దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ

జిల్లాలో మొత్తం కార్డుల సంఖ్య 5,72,982

మేడ్చల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో కొత్త రేషన్ కార్డులు భారీగా పెరిగాయి. జిల్లా వ్యాప్తంగా మూడు నెలల్లో 35,172 మందికి నూతనంగా రేషన్ కార్డులు మంజూరయ్యాయి. జిల్లాలో ఇంతకుముందు 5,37,810 రేషన్ కార్డులు ఉండంగా ప్రస్తుతం ఆ సంఖ్య 5,72,982కు పెరిగింది. నూతన కార్డుదారులందరికీ ఈ నెల నుంచి సన్న బియ్యం అందజేయనున్నారు. జిల్లాలో 618 రేషన్ దుకాణాలుండగా లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జూన్ నెలలోనే మూడు(జూన్, జూలై, ఆగస్టు) నెలల కోటాను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాగా, ప్రస్తుతం సెప్టెంబరు నెల కోటాను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. దాదాపు పది సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న అర్హులైన చాలా మందికి కొత్త కార్డులు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ- కేవైసీ చేసుకోవాలి

కొత్త కార్డుల మంజూరుతో జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. ఈ నెల(సెప్టెంబరు) నుంచి పాత కార్డుదారులతో పాటు కొత్త లబ్ధిదారులకు కూడా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. ప్రతీ లబ్ధిదారుడికి కచ్చితంగా సన్న బియ్యం అందజేస్తాం. ఇప్పటికే జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభమైంది. లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకోవడంతో పాటు తప్పనిసరిగా ఈ కేవైసీ కూడా చేసుకోవాలి.

-శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌వో, మేడ్చల్ జిల్లా

ఆర్ఆర్ఆర్‌కు మా భూములివ్వం

హెచ్‌ఎండీఏ అధికారులకు స్పష్టం చేసిన నవాబుపేట మండలంలోని చిట్టిగిద్ద రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణానికి తమ భూములు ఇచ్చేది లేదని నవాబ్‌పేట మండలం పరిధిలోని చిట్టిగిద్ద గ్రామానికి చెందిన పలువురు రైతులు హెచ్‌ఎండీఏ అధికారులకు స్పష్టం చేశారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో తమ భూములను కోల్పోతామని భావిస్తున్న వారు బుధవారం హైదరాబాద్ హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వెళ్లి తమ వైఖరిని అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డుకు తమ భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని, ఒకవేళ బలవంతంగా భూములు తీసుకునే ప్రయత్నం చేస్తే రైతుల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని వారు అధికారులతో స్పష్టం చేశారు. ఈ మేరకు వారు ట్రిపుల్ ఆర్‌కు తమ భూములు ఇచ్చేది లేదంటూ వారు అధికారులకు ఓ లేఖ అందజేశారు.



హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్దం చిట్టిగిద్ద రైతులు

రుద్రారం - నాగసమందర్ మధ్య వంతెన నిర్మాణానికి సర్వే

ధారూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు 2016లో కొట్టుకుపోయిన వంతెన నిర్మాణం చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం సర్వే చేశారు. మండల పరిధిలోని రుద్రారం - నాగసమందర్ గ్రామాల మధ్య ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు పారే వంతెన దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు. అనంతరం వంతెనకు ఆర్‌అండ్ అధికారులు తాత్కలిక మరమ్మతులు చేసి వదిలేశారు. కాగా వంతెనపై నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నీరు పెద్ద మొత్తంలో ప్రవహించి కాగ్నా నదిలో కలుస్తుంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వంతెనపై నుంచి అలుగు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన నిర్మాణానికి స్పీకర్ ప్రసాద్ కుమార్ ద్వారా మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డికి మాజీ వైస్ ఎంపీపీ వరద మల్లికార్జున్ వినతి పత్రం సమర్పించారు. దీంతో ఈ వంతెన నిర్మాణం చేపట్టేందుకు సర్వే చేసి నివేదిక పంపించాలని ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ఆదేశాలు అందాయి. ఈ మేరకు స్థానిక అధికారులు సిబ్బందితో వంతెన సర్వే చేసి కొలతలు తీసి మార్కింగ్ చేశారు. వంతెన నిర్మాణంపై కదలిక రావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్..
తెలంగాణ బాలికలు, బాలుర విజయం


బహుమతులు అందుకుంటున్న తెలంగాణ క్రీడాకారులు

నందిగామ, సెప్టంబరు 3(ఆంధ్రజ్యోతి):రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హాశాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు దూసుకుపోతున్నారు. సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్‌నికోబార్ జట్లు పాల్గొన్నాయి. మంగళ, బుధవారాల్లో జరిగిన పోటీల్లో తెలంగాణ జూనియర్ గర్ల్స్, జూనియర్ బాయ్స్ గెలిచారు. సీనియర్ ఉమెన్, మెన్ తృతీయ స్థానంలో నిలిచారు. ఏపీ సీనియర్ ఉమెన్ రన్నర్స్‌గా, సీనియర్ మెన్ మూడో స్థానంలో నిలిచారు. కర్ణాటక జట్లు జూనియర్ గర్ల్స్ మూడో స్థానం, జూనియర్ బాయ్స్ రన్నర్స్‌గా, సీనియర్ ఉమెన్ విన్నర్స్‌గా నిలిచారు. తమిళనాడు జట్లు జూనియర్ గర్ల్స్ రన్నర్స్‌గా, బాయ్స్ మూడో స్థానం, సీనియర్ ఉమెన్ మూడో స్థానం, సీనియర్ మెన్ విన్నర్స్‌గా నిలిచారు. కేరళ జట్టు జూనియర్ గర్ల్స్, జూనియర్ బాయ్స్ మూడో స్థానంలో నిలిచారని నిర్వాహకులు తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవంలో జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రతీ కుటుంబానికి మేలు


తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలం టాక్‌రాజ్‌గూడ, మైసిగండిలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. టాక్‌రాజ్‌గూడలో రూ.6లక్షలతో నిర్మించే తాగునీటి పైపులైన్ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మైసిగండిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు పైపులైన్లు, వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేస్తూ రవాణ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు సొంతిల్లు సాకారమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. పేదల ప్రగతిని జీర్ణించుకోలేని విపక్షాలు ప్రతీది రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారాయని మండిపడ్డారు. అవకాశ వాద బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు విశ్వసించరని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. టాక్‌రాజ్ గూడలో ఇళ్లపైనుంచి ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, బల్‌రామ్, అధికారులు, నాయకులు బిచ్యా, బిక్యా, వెంకటేశ్, పర్వతాలు, అశోక్, షాబుద్దీన్, అజీమ్, హరిచంద్, జగన్, శ్రీరాములు, కోట్యా, శ్రీను, నరేందర్, కేశవులు, లక్పతి, హన్మ, నరేశ్ పాల్గొన్నారు.

నిరసన.. కేంద్ర ప్రభుత్వంపై చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కడ్తాల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసమే బీజేపీ నాయకులు కల్వకుర్తి నియోజకవర్గంలో నిరసన దీక్షలు చేస్తున్నారని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. బీజేపీ నాయకులు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, యూరియా కేటాయింపులు, అమలు చేయని హామీలు,బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రం ప్రభుత్వంపై ఢిల్లీలో నిరసన దీక్షలు చేయాలన్నారు. కడ్తాలలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు బీజేపీ నాయకులకు కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్రం ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. బీజేపీ అబద్ధాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. అభివృద్ధి అడ్డుకునేలా వారు కుట్ర చేస్తూ దీక్షల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవి, నాయకులు లక్పతి, మల్లేశ్‌గౌడ్, సత్యం, శ్రీను, వినోద్, జవహర్‌లాల్, తులసీరామ్ పాల్గొన్నారు.

కొడంగల్ ప్రాంత అభివృద్దే ధ్యేయం


కొడంగల్‌లో షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి, అధికారులు, నాయకులు

కొడంగల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వెనకబడిన కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లోని తాండూర్ రోడ్డులో షాదీఖానా నిర్మాణానికి రూ.2.5కోట్లతో శంకుస్థాపన చేసి మాట్లాడారు. మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటుతో విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గతంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ హయాంలో చేపట్టిన షాదీఖానా శిథిలావస్థకు చేరడంతో నూతన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో డబ్బాలు పోయిన వారికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తహసీల్దార్ దీపక్ శ్యామ్సన్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, యూసుఫ్, ఎన్.ప్రశాంత్, నయీమ్, ఆసిఫ్‌ఖాన్, నర్సిములు, హమీద్, అశ్వక్, సిరాజ్, సీపీఐ బషీర్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: చౌదర్‌పల్లిలో రూ.1.6 కోట్లతో యూజీడీ నిర్మాణానికి తిరుపతిరెడ్డి, అధికారులు శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీని ప్రారంభించారు. నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, అంజిల్‌రెడ్డి, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మంత్రి రాము

పరిగి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కోశాధికారి మంత్రి రాము అన్నారు. బుధవారం పరిగిలోని జరిగి బీకేఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. చాలా మంది రైతులకు రుణమాఫీ, రైతుభరోసా అందడం లేదన్నారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి, మల్లారెడ్డి, సుబ్బారెడ్డి, సుభాష్‌చందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నాయకులు రైతు సమస్యలపై ఏడీఏకు వినతి పత్రం ఇచ్చారు.

ఎయిర్ పోర్టులో ఈ-శ్రమ్ శిబిరం



ఈ-శ్రమ్ శిబిరంలో పాల్గొన్న క్యాబ్ డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం బుధవారం ఈ-శ్రమ్ నమోదు శిబిరాన్ని నిర్వహించారు. టీజీపీడబ్ల్యూయూ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ.. దత్తోపంత్ తేంగడి నేషనల్ బోర్డ్ ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ కలిసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. డీటీఎన్‌బీడబ్ల్యూ ఈడీ హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టర్ ఎంఆర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. దేశంలోని రద్దీ విమానాశ్రయాల్లో శంషాబాద్ విమానాశ్రయం ఒకటని, అందుకే కార్మిక సంక్షేమానికి ప్లాట్‌ఫాం కృషి చేస్తోందని చెప్పారు. ఈశ్రమ్ ద్వారా గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్ల భవిష్యత్ రక్షణ కలిగించే ప్రభుత్వ పథకాలతో అనుసంధానమవుతారన్నారు. ఈ శిబిరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5 వరకు కొనసాగుతోందన్నారు.

బీఆర్‌ఎస్‌ను నాశనం చేస్తున్న కవిత



పట్లోళ్ల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కవిత బీఆర్ఎస్ పార్టీని సర్వ నాశనం చేస్తోందని, బీఆర్ఎస్ ఓటమికి ఆమే కారణమని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత బీఆర్ఎస్‌ను వీడినా నష్టం ఏమీ లేదన్నారు. 60లక్షల మంది సభ్యత్వం ఉన్న బీఆర్ఎస్‌పై బురద జల్లుతే ఊరుకోం అని హెచ్చరించారు. లిక్కర్ కేసులో ఆమె జైలుకు వెళ్లేముందు ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కవితకు ఎంపీగా, ఎమ్మెల్సీగా అవకాశాలు కల్పించిందన్నారు. లిక్కర్ కేసుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కవితను బ్లాక్ మెయిల్ చేస్తున్నాయని, ఈ విషయాన్ని ఆమె చెప్పలేక పోతోందన్నారు. కవిత కేసీఆర్ కూతురు, కేటీఆర్ చెల్లె కావడంతోనే బీఆర్ఎస్‌పై ఆమె చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై మహిళలు ఏమీ అనడం లేదని తెలిపారు. ప్రెస్‌మీట్ పెట్టి కవిత విలువ పోగొట్టుకుందని విమర్శించారు.

కాలువలో కారు బోల్తా

● బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నితీష్‌రెడ్డి దుర్మరణం





కారు బోల్తాపడి మృతిచెందిన నాయకుడు నితీష్‌రెడ్డి

చేవెళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అతి వేగం, అజాగ్రత్తగా కారు డ్రైవ్ చేస్తూ కల్వర్టు వద్ద కాలువలో పడి బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మృతిచెందిన సంఘటన చేవెళ్లలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లకు చెందిన గుడిపల్లి నితీష్‌రెడ్డి (27) బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. పని నిమిత్తం మంగళవారం అర్ధరాత్రి చేవెళ్ల నుంచి పామెన కారులో వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కాలువలో బోల్తాపడింది. దీంతో నితీష్‌రెడ్డి కారులో ఇరుక్కపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అర్ధరాత్రి కావడంతో ప్రమాదాన్ని ఎవరూ గమనించలేదు. బుధవారం ఉదయం రైతులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకొని క్రేన్‌తో నితీష్‌రెడ్డి, కారును వెలికి తీశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. నితీష్‌రెడ్డి తల్లి గతంలోనే చనిపోగా తండ్రి కొన్ని నెలల క్రితం చనిపోయాడు. అతడికి భార్య ఉంది. నితీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నివాళులు అర్పించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

కారు బోల్తాపడి మృతిచెందిన నితీష్‌రెడ్డి మృతదేహానికి బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపాల్ అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులు నితీష్‌రెడ్డి మృతదేహానికి పూలువేసి ఘనంగానివాళ్లు అర్పించారు. అతడి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

వినూత్న విఘ్నేశులకు పురస్కారాలు



స్వర్ణగిరి విఘ్నరాజ మండప నిర్వాహకుడు సాయిప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న సంస్కార భారతి సభ్యులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా మండపాలను ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు చేస్తున్న మండప నిర్వాహకులకు సంస్కార భారతి పురస్కారాలను అందజేసింది. షాద్‌నగర్‌లోని గణేష్ పండపాలను మంగళవారం రాత్రి సంస్కార భారతి, జాతీయ సాంస్కృతిక సేవా సంస్థ, తెలుగు రుచులు షాద్‌నగర్ శాఖ ప్రతినిధులు పరిశీలించారు. పద్మావతి కాలనీలోని వివేకానంద సేవా సమితి నెలకొల్పిన స్వర్ణగిరి వినాయకుడు, విజయనగర్ కాలనీలోని దోస్తానీ గణేష్, వినాయకగంజ్‌లోని వినాయక మండలి విఘ్నేశ్వరుడు, క్రిష్టియన్ కాలనీ టీమ్ ఎస్‌వీఎస్ గణనాథుడు, పటేల్‌రోడ్‌లోని బాల గణేషులను ఎంపిక చేసి నిర్వాహకులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. నిత్య పూజలే కాకుండా నిష్ఠతో నిమజ్జనాన్ని కూడా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల ప్రతినిధులు బెజుగం రమేష్, టీవీ రంగయ్య, కె.రంగనాథం, ఎస్.రవీందర్, శివ, రమేష్, స్వాతిరెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాల్ని అమలు చేస్తున్న కేంద్రం

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాల్ని అమలుచేయడం నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. బుధవారం మండల కన్వీనర్ బాల్‌రాజ్ అధ్యక్షతన కందుకూరులోని సీతారామశాస్త్రి కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో శ్రామిక మహిళ యూనియన్ జిల్లా కన్వీనర్ జి.కవితతో కలిసి పాల్గొని చంద్రమోహన్ మాట్లాడారు. కార్పొరేట్ల కొమ్ము కాలసేలా కేంద్రం పనిచేస్తుందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో నేదునూరుకు చెందిన సీపీఎం నాయకుడు శ్రీనివాస్‌ను సీఐటీయూ మండల కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమార్, శ్రీలత, సరస్వతి, సత్తయ్య, పి.శ్రీరాములు, కె.శ్రీనివాస్, నరసింహ, లక్ష్మణ్, సాయిలు, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

రుణమాఫీ కోసం కృషి చేయాలని ఎంపీకి వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండలంలో రైతులకు రుణమాఫీ జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు, వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌లను కలిసి వినతి పత్రాలు అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే, ఎంపీ నివాసాలకు వెళ్లి వారిని కలిసి సమస్యను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు గడుస్తున్నా మండలంలోని 1,189 మంది రైతులకు నేటికీ రుణమాఫీ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల్లో అప్పులున్న రైతులపై వడ్డీభారం పడుతోందన్నారు. ఈ సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని ఎమ్మెల్యే, ఎంపీలను కోరారు. కార్యక్రమంలో రైతులు, పార్టీల నాయకులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి ఆర్యవైశ్య మహాసభ చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదల విద్యాభివృద్ధికి ఆర్య వైశ్య మహాసభ చేయూతనిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణగుప్తా తెలిపారు. షాద్‌నగర్ టీటీడీ కల్యాణ మం డపంలో బుధవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీ సేవా ప్రముఖ్ రమేష్, గణేష్‌గుప్తా, రవికుమార్, గోపాల్, లక్ష్మయ్య,రమాదేవి, రమేష్, శ్రీనివాస్‌గుప్తా, నారాయణ పాల్గొన్నారు.

యూరియా కొరత.. రైతుల వ్యథ

బారులు తీరుతున్న అన్నదాతలు | ఒక్క బస్తా అయినా దొరకని వైనం



కొందుర్గులో యూరియా కోసం బారులు తీరిన రైతులు



యాలాలలో లారీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు



యూరియా కోసం యాచారం సొసైటీ వద్ద లైన్ కట్టిన రైతులు

యాచారం/కొందుర్గు/యాలాల/పెద్దేముల్/దారూరు/మంచాల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యూరియా డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రాథమిక సహకార సంఘాలు, ఫెర్టిలైజర్ షాపుల వద్ద ఉదయం నుంచే రైతులు పడిగాపులు కాస్తున్నారు. వస్తున్న ఒకటీ అరా లోడ్లు రైతులకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా అయినా దొరకని పరిస్థితి తలెత్తుతోంది. టోకెన్లు ఇచ్చి పోలీసుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేస్తున్నారు. బుధవారం యాచారంలో రైతులు ఉదయమే సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. యూరియా లేదని తెలిసి నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై రాస్తారోకోకు సిద్ధమవగా సొసైటీ సీఈవో నాగరాజు, మహేష్, ఇన్‌స్పెక్టర్ ఎ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు సత్యనారాయణ, ప్రియాంకలు పది గంటలకల్లా యూరియా ఇస్తామని హామీ ఇచ్చారు. యూరియా లారీ రాగానే ఇన్‌స్పెక్టర్ ఒక్కో రైతుకు ఒక్క బస్తాకు స్లిప్‌లు పంపిణీ చేశారు. 450 మంది రైతులకు బస్తా చొప్పున ఇచ్చారు. అందరికీ సరిపడినంత యూరియా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఉమ్మడి కొందుర్గు మండలంలో సొసైటీ వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇక్కడికి రోజుకు 450 బస్తాల యూరియా మాత్రమే వస్తోంది. యూరియా కోసం పెద్దఎత్తున వస్తుండడంతో ఆధార్ లింక్‌తో ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇస్తున్నారు. ఒకేసారి ఐదు బస్తాలు ఇవ్వాలని రైతులు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. కాగా ఏవో సురేష్‌రెడ్డి రైతులతో మాట్లాడుతూ.. యూరియా అధికంగా వాడితే పంటలకు రోగాలెక్కువ వచ్చి దిగుబడి తగ్గుతుందని, పెట్టుబడి పెరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం డౌన్‌డౌన్.. సొసైటీ, వ్యవసాయాధికారులు డౌన్‌డౌన్ అంటూ యాలాల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. యాలాల, బషీరాబాద్ మండలాలకు లారీ లోడ్ యూరియా యాలాల సొసైటీకి వచ్చింది. అప్పటికే 400మంది వరకు రైతులు అక్కడికి చేరుకున్నారు. యూరియా సరిపోదని అధికారులు పంపిణీ నిలిపారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య చేరుకుని రైతులతో మాట్లాడారు. బషీరాబాద్ మండల 225 బస్తాల యూరియాను కూడా యాలాల రైతులకే ఇవ్వాలని ఆందోళన చేశారు. చివరకు ఉన్నంత మట్టుకు పంపిణీ చేశారు. యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందని ముకుందాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. పెద్దేముల్ సొసైటీకి బుధవారం 220 బస్తాల యూరియా వచ్చింది. రైతులంతా ఒకేసారి రావడంతో అధికారులు, సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉన్న విషయాన్ని రైతులకు వివరించారు. రెండురోజులుగా యూరియా దొరకలేదని, ఈ రోజైనా ఇవ్వకుంటే ఊరుకోం అని భీష్మించారు. సొసైటీ మేనేజర్ పోలీసులకు తెలపడంతో ఎస్ఐ.వేణుకుమార్ చేరుకుని రైతులను సముదాయించారు. ఉన్న యూరియా సరిపోదని అధికారులు సొసైటీకి తాళం వేసుకుపోయారు. రెండురోజుల్లో మరో లోడ్ వస్తుందని, అప్పుడే పంపిణీ చేస్తామన్నారు. దీంతో రైతులు మధ్యాహ్నం వరకు వేచిచూసి వెళ్లిపోయారు. ధారూరు మన గ్రోమోర్ వద్ద రైతులు క్యూ కట్టారు. రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. పట్టాదారు వేలి ముద్రలు లేని వారికి యూరియా ఇవ్వలేదు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశాడు. బుధవారం మంచాలలో పాక్స్ వద్ద చేపట్టిన ధర్నాలో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఆందోళనలో నాయకులు, రైతులు కె.శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, జంగయ్య, లెనిన్, బి.సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రవిరాజ్, వినోద్, బాల్‌రాజ్, ఐలయ్య, మాధవరెడ్డి, శివప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్ సొసైటీ వద్దకు భారీ సంఖ్యలో వచ్చిన రైతులు



ధారూరులోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద గుమిగూడిన రైతులు



షాబాద్‌లో యూరియా కోసం లైన్‌లో నిల్చున్న రైతులు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

● జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్



రైతులకు ఒప్పంద పత్రాలు అందిస్తున్న సురేశ్

ఆమనగల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్ అన్నారు. తక్కువ నీరు, స్వల్ప పెట్టుబడితో అధిక లాభాలు పొందే ఉద్యాన, ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి రైతు వేదికలో బుధవారం ఉద్యానవ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. డివిజన్ ఉద్యానవన అధికారి సౌమ్య అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు జిల్లా అధికారి సురేశ్, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, ఆయిల్‌పామ్ ఏరియా మేనేజర్ ప్రమోద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అయిల్‌పామ్ సాగు విధానం, లాభాలు, మార్కెటింగ్, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం తదితర విషయాల గురించి అధికారులు వివరించారు. సురేశ్ మాట్లాడుతూ అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సాకం అందిస్తుందని తెలిపారు. మొక్కలకు 90 శాతం రాయితీ, డ్రిప్‌కు 80 నుంచి 100 శాతం రాయితీతో పాటు మొక్కలు నాటిన 4 సంవత్సరాల వరకు ఎకరానికి రూ.4200 మెయింటెనెన్స్ కింద అందిస్తుందని తెలిపారు. ఈ పంటకు దళారీ వ్యవస్థ లేదని, ఆయిల్‌పామ్ చట్టం-1993 ప్రకారం రైతులకు పంట అమ్ముకోవడంలో రక్షణ కల్పిస్తుందన్నారు. రంగారెడ్డి జిల్లాకు ప్రభుత్వం వాల్యూ ఆయిల్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుందని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కంపెనీ పంట కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ పంట వేసిన రైతులకు వాల్యూ ఆయిల్ కంపెనీ కొనుగోలు ఒప్పంద పత్రాలను అందజేశారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఈవో శ్రవణ్‌కుమార్, ఏఈవో భూదేవి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి ..

విద్యుత్ షాక్‌తో బ్యాంకు ఉద్యోగి మృతి



సురేశ్(ఫైల్)

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో ఓ బ్యాంకు ఉద్యోగి కరెంట్‌షాక్ తగిలి మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ కింది బస్తీ పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా బుధవారం రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు విద్యుత్ స్తంభాకు ఉట్టి కట్టి దానిని కొట్టే క్రమంలో ఓ స్తంభం విద్యుత్ తీగ తెగి పడింది. దీంతో ఉట్టి కొడుతున్న బ్యాకు ఉద్యోగి సురేశ్(30) కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే సురేశ్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అతడు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చేవెళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డువేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం మండల పరిధి కమ్మెటలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 217 నుంచి అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు తమ వెంచర్లలోకి వేసిన రోడ్డును రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగింపజేశారు. ప్రభుత్వ భూమి చుట్టూ కాలువ తీయించారు. ప్రభుత్వ భూముల నుంచి దౌర్జన్యంగా రోడ్డువేస్తే కేసులు నమోదు చేయిస్తామని, అసైన్డ్ భూములు పొందిన రైతులు ఇతరులకు అమ్మితే పీవోటీ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ అన్నారు. ఆర్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కాలం చెల్లిన పార్టీలు : సబితారెడ్డి



పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో కాలం చెల్లిన పార్టీలుగా బీజేపీ, కాంగ్రెస్‌లు మిగిలాయని, హామీల అమలులో ఈ ప్రభుత్వాలు విఫలమయ్యాయని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బుధవారం నాగారానికి చెందిన 40మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించి ఎమ్మెల్యే మాట్లాడారు. మహేశ్వరం బీఆర్ఎస్ అడ్డా అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను, రైతులను మోసం చేసింది చాలదన్నట్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్న కాంగ్రెస్ భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుపడుతున్న కొందరు కాంగ్రెస్ నాయకుల ఆటలు సాగవని, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామన్నారు. ఎవరికి ఆపదొచ్చినా పరిష్కరించేందుకు తాను ఉంటానన్నారు. మహేశ్వరంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో గెలవాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ముడిమ్యాల్ మాజీ సర్పంచ్ స్వర్ణలతదర్శన్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆమె మాట్లాడుతూ... జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని సూచించారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, వెంకటేశ్, శివకుమార్, గోపమ్మ,జహిదాబీ, రవీందర్, మోహన్‌రెడ్డి, సుజాత ఉన్నారు.

మంత్రి వివేక్‌కు ఘన సన్మానం



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

పరిగి,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్‌స్వామిని బుధవారం పరిగిలో నాయకులు కలిశారు. మంత్రి దుద్యాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో సుల్తాన్‌పూర్‌లో క్యూవైఏ గార్డెన్‌కు వచ్చారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు.రోస్టర్ విధానంలో, ప్రమోషన్లు, ఎస్సీ, ఎస్టీ అడెక్వసీతో మాలలకు జరిగిన అన్యాయంపై వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్ కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంతు, శివరాజు, వెంకటయ్య, రాములు, శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహులు, అనితయాదయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



చిన్నారులతో ముచ్చటిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అధికారులను, అంగన్‌వాడీ టీచర్లను, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేటలోని హెచ్‌బీఎల్ భగీరథ్ బాలల వికాస కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ బాలల వికాస కేంద్రానికి నిత్యం ఎంతమంది పిల్లలు హాజరవుతున్నారని కేంద్రం టీచర్లను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారా? అని అడిగారు. అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, మెయింటనెన్స్ బాగున్నాయని అంగన్‌వాడీలను మెచ్చుకున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని బడికి తీసుకవచ్చేలా కృషిచేయాలని టీచర్లకు సూచించారు. కేంద్రానికి వచ్చే వారికి ఆట వస్తువులను అందజేస్తూ ఆటల ద్వారా బోధన అందించేందుకు శ్రద్ధ చూపాలన్నారు. రోజూ కొత్త ఆట, పాటలతో పిల్లలను ఆకట్టుకుంటూకేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుచూ వారికి పౌష్టికాహారాన్ని అందించాలని టీచర్లకు, సిబ్బందికి సూచించారు. పుట్టిన రోజు ఉన్న అంగన్‌వాడీ చిన్నారులను అదనపు కలెక్టర్ అభినందిస్తు కేంద్రంలో బొమ్మలను కానుకగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతే ఆవిష్కరణలకు వెన్నెముక



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న జానయ్య

మొయినాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనలతో ముందుకుసాగే యువత ఆవిష్కరణలకు వెన్నెముక అని పీజేటీఎస్ఏయూ వైస్ చాన్స్‌లర్ జానయ్య అన్నారు. చిలుకూరులోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)ఆధ్వర్యంలో ఈ నెల 4 వరకు జరగనున్న ఎస్‌డబ్ల్యూడబ్ల్యూఎస్-2025 జాతీయ సదస్సు రెండో రోజు బుధవారం ఆయన పాల్గొన్నారు. ఆవిష్కరణలు, విజయాలకు వయసు అడ్డు కాదన్నారు. సదస్సులో వివిధ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధి దీప్తి, అగ్రికల్చర్ హబ్ ఎండీ వెంకటేశ్వర్లు, సీఈవో సీత, విజయ్ పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 3: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు సంపూర్ణ చంద్ర గ్రహణం ఉండటంతో 9వ రోజు గురువారం నిమజ్జనం చేసే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చెరువుకు ఇరువైపులా బారికేడ్లు, లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విగ్రహాల నిమజ్జనానికి మూడు క్రేన్లను సమకూర్చారు. 70 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.


చెరువు కట్టపై ఏర్పాటు చేసిన లైట్లు


నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన క్రేన్లు


ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులోకి వెళ్లకుండా బారికేడ్లు

కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

కీసర రూరల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి పెద్ద చెరువును సందర్శించారు. వచ్చే మూడు రోజుల్లో నిమజ్జనాలకు పెద్ద ఎత్తున గణపతి విగ్రహాలు తరలి వస్తాయని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, ఈడీ సంతోష్‌కుమార్, ఆర్వో నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలు దుద్యాలలోనే ఉండాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల కేంద్రంలోనే ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని దుద్యాల, కుదురుమళ్ల, ఆలేడ్, అల్లిఖాన్‌పల్లి, వాల్యానాయక్ తండా, చిలుముల్‌మైలారం, నాజ్‌ఖాన్‌పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉండాల్సిన తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు, పీహెచ్‌సీ, సమీకృత విద్యాలయం, అధునాతన సాంకేతిక కేంద్రం, ఐటీఐ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహిళా సమాఖ్యకు సంబంధించిన పెట్రోల్ బంక్‌ను హకీంపేట్‌లో ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, ఖాజా, ఖలీల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు


రేషన్‌కార్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ ప్రతాప్‌సింగారంలో బుధవారం లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఇందిరమ్మ రాజ్యస్థాపనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అబేదా బేగం, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్, కీసరగుట్ట కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌గౌడ్, నాయకులు నత్తి కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ విఠల్, సిబ్బంది పాల్గొన్నారు.

బోరుబావుల్లో నుంచి డ్రైనేజీ నీరు

వికారాబాద్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో బోరు బావుల్లో నుంచి డ్రైనేజీ నీరు బయటకు వస్తోంది. గతంలో శాటిలైట్ టౌన్ పనుల్లో భాగంగా చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో డ్రైనేజీలు పొంగిపొంగిపొర్లి తాగునీటి పైపులైన్లు కలుషితం అవుతున్నాయి. బుధవారం బోరు బావుల్లో కలుషితనీరు రావడంతో మాజీ కౌన్సిలర్ బొండల శ్రీనివాస్, కాలనీ వాసులు కమిషనర్‌ను కలిశారు. బోరు నుంచి వచ్చిన నీటిని చూపించారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరడంతో కమిషనర్ జాకీర్ అహ్మద్ సానుకూలంగా స్పందించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచమ్మ తండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, అధికారులు, నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మతండాలో కడా(కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ) నుంచి రూ.20లక్షల నిధులు అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రవికిరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, రాజునాయక్, కే.నాగప్ప, శంకర్, అంగన్‌వాడీ టీచర్ కమలమ్మ, పంచాయతీ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పరిగి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు గోపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశ్ కోరారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాంచంద్రయ్య, యాదయ్య, నజీర్, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

పరిగి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దాతల చేయూత అభినందనీయమని లక్ష్మీదేవిపల్లి హెచ్‌ఎం సాయిబాబా అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం గ్రామానికి చెందిన దాత మెట్ట శ్రీశైలం సహకారంతో విద్యార్థులకు ఉచితంగా టై, బెల్టులు, ఐడీ కార్డులు అందజేశారు. నాయకులు శ్రీశైలం, హన్మయ్య, నరేష్, వెంకయ్య, గోపాల్, శ్రీనివాస్, మొగులయ్య, టీచర్ రాంచంద్రయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి చైర్లు, ర్యాక్‌లు..

తాండూరు రూరల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ తాండూరు అధ్యక్షుడు శరణు బసప్ప పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చైర్లు, ర్యాక్‌ను అందజేశారు. బుధవారం శరణు బసప్ప కూతురు కీర్తన, రాంచరణ్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి చైర్లు, ర్యాక్‌లు అందించారు. క్లబ్ కార్యదర్శి నటరాజ్, ట్రెజరర్ గౌరీశంకర్, సల్లా దామోదర్, ఓం ప్రకాష్ సోమాని, బసప్ప, సంగప్ప, ఆయా అనిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చౌడాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కేతావత్ జాన్యనాయక్ బుధవారం మృతి చెందారు. పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి జాన్యనాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అనిల్‌రెడ్డి, రాందాస్ నాయక్, నర్సింహ, మేగ్యనాయక్, విక్కీ, ప్రవీణ్ ఉన్నారు.

జీవాలకు వ్యాక్సిన్ తప్పనిసరి

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు వచ్చే పారుడు వ్యాధి నివారణకు పెంపకందారులు తప్పనిసరిగా పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలని ఎరాన్‌పల్లి వెటర్నరీ సబ్ సెంటర్ జేవీవో వెంకటయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో 548 గొర్రెలకు, 426 మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారుడు వ్యాధి వైరస్ వల్ల వస్తుందని, దీంతో జీవాల్లో జీర్ణ, శ్వాస, నాడీ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర శివకుమార్, సిబ్బంది పద్మమ్మ, జీవాల యజమానులు ఉన్నారు.

అంపల్లి రోడ్డులో గుంత పూడ్చివేత

ధారూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దోర్నాల్-అంపల్లి రోడ్డులో భారీ వర్షాలకు గుంత పడి ప్రమాదకరంగా మారింది. బుధవారం ఆ ప్రాంతంలో కాలువ తీసి పైపలు వేసి చదును చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్ కలిసి ఈ పనులు పూర్తి చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

దోమ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో గ్యామానాయక్ అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతోపాటు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దుద్యాలలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాళేశ్వరంతో నీళ్లు ఇచ్చినందుకా విచారణ?

దుద్యాల/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం కట్టి రైతులకు నీళ్లు ఇచ్చినందుకా సీబీఐ విచారణ అంటూ బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. బుధవారం దుద్యాల మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, మడిగే శ్రీనివాస్, నరేశ్‌గౌడ్, జావీద్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి 70 లక్షల ఎకరాలకు నీరు అందించి తెలంగాణను సస్యశ్యామలం చేయాలని రూ.97వేల 300 కోట్లతో కాళేశ్వరం నిర్మిస్తే లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఘోష్ కమిషన్ వేసి ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతుందని ఆరోపించారు. ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, వాజీద్, శాసం వెంకటయ్య, బసప్ప, బుగ్గప్ప, బస్‌రెడ్డి, సాయిలు, బసప్ప, బుగ్గప్ప, రమేశ్, ఇమ్రాన్, నర్సింహారెడ్డి, ముక్తార్, విశాల్, బాల్‌సింగ్‌నాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు కోట్ల యాదగిరి, మహేందర్‌రెడ్డి, శేరి నారాయణరెడ్డి, రవీంద్రచారి, సంతోష్‌నాయక్ తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న నాయకులు

కులకచర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మన ఊరు-మన బడి కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేసిన బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని మాజీ విద్యా కమిటీ చైర్మన్లు బుధవారం కులకచర్ల చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పులు చేసి పనులు చేశామని, సీఎం రేవంత్‌రెడ్డి బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, రవిచందర్, బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, నాయకులు అంజిలయ్య, షైపాల్, మాజీ విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఘట్‌కేసర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ రాజేష్ అన్నారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని జెడ్పీ బాలికల పాఠశాలలో ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ మానవాళికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిర్వాహకుడు యాదగిరి, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సత్యనారాయణ, లింగస్వామి పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో అధిక దిగుబడులు పొందవచ్చునని కొడంగల్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శంకర్‌రాథోడ్ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా ద్వారా పంట ఉత్పాదకత ఎనిమిది శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన నేతలు


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బషీరాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైల్వార్ కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి గ్రామ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై కాంగ్రెస్ నాయకుడు సొంపల్లి బిచ్చిరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గ్రామంలో రూ.2లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపడుతున్న పైపులైన్ పనుల కోసం తీర్మానం ఇవ్వాలని కార్యదర్శిని అడిగితే, ఓ నాయకుడు ఇవ్వకుండా అడ్డుకుంటున్నాడని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, శంకరప్ప, రామునాయక్, నగేశ్, శ్రీహరి ఉన్నారు.

అనాథలను ఆదుకోవడమే ధ్యేయం

శామీర్‌పేట, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): అనాథలను, నిరుపేదలను ఆదుకోవడమే అఫ్జల్ ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహ్మద్ అఫ్జల్ ఖాన్ అన్నారు. అఫ్జల్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం శామీర్‌పేటలోని మాతృశ్రీ ఆశ్రమంలో అనాథలకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మాతృశ్రీ ఆశ్రమ వ్యవస్థాపకుడు నర్సింహ, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, వరుణ్, మానస తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నడుస్తూనే కుప్పకూలాడు


నవీన్‌రాంరెడ్డి(ఫైల్)

కీసర, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విధులకు హాజరైన వ్యక్తి నడుస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. ఈ ఘటన కీసరలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కీసరకు చెందిన నవీన్‌రామ్‌రెడ్డి(45) దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల్ గీతాంజలి కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా(ఏఓ) విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే నవీన్‌రాంరెడ్డి గత నెల 30న విధులకు వెళ్లే క్రమంలో తన క్యాబిన్‌కి నడుచుకుంటూ వెళ్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన సహోద్యోగులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా ప్రస్తుతం వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

గుండెపోటుతో మాజీ ఉపసర్పంచ్ మృతి



తాండూరు రూరల్, సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం గుంతబాస్పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ ఖైరత్ అలీ(58) గుండెపోటుతో మృతి చెందారు. గ్రామంలోని తన నివాసంలో మంగళవారం అర్ధరాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందిన కొద్దిసేపటికి ఖైరత్ అలీ కోలుకున్నారు. తగ్గిందని భావించిన కుటుంబ సభ్యులు తాండూరులోని ఇంటికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున 5గంటలకు మరోసారి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గ్రామస్తులు సంతాపం తెలిపారు.

ఖననం చేసిన మృతదేహానికి శవపరీక్ష

పూడూరు, సెప్టెంబర్ 3, (ఆంధ్రజ్యోతి): ఖననం చేసిన మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి శవ పరీక్ష నిర్వహించారు. చెన్‌గోముల్ ఎస్‌ఐ భరత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం దేవినోనిగూడ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ పాషా(27) గతనెల 22న పురుగుల మందు తాగాడు. హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆసుత్రిలో చికిత్స పొందుతూ 28న మృతి చెందాడు. కుటుంబీకులు మృతదేహాన్ని ఖననం చేశారు. తన కొడుకు మృతిపట్ల అనుమానాలు ఉన్నాయని మహ్మద్ గౌస్ పాషా తండ్రి మహ్మద్ జాఫర్ చెన్‌గోముల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం పూడూరు తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికితీసి పంచనామా, శవ పరీక్షలు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇంటితో సొంతింటి కల సాకారం


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

కులకచర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటితో సొంతింటి కల నెరవేరుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్లలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి ప్రొసీడింగ్ అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ భరత్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్, కృష్ణ, రాములు, ఎల్లప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మాలలపై ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ'

ఘట్‌కేసర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాలలపై రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తూ అణిచివేతకు గురి చేస్తుందని మాల మహానాడు జిల్లా కన్వీనర్ పరశురాం ఆరోపించారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 99 మాల విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నదన్నారు. ఎస్సీ వర్గీకరణ జీవో తీసుకురావడంలో అందరు ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. రోస్టర్ పాయింట్ 22నుంచి 16కు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈనెల 8న అన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, శ్యామ్, రాము, మధు, సాయికిరణ్, రఘు, అనిల్, బద్రి, గోపి పాల్గొన్నారు.

గుండెపోటుకు అందుబాటులో అత్యవసర సేవలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ప్రాంతంలో గుండెపోటుకు గురైన వారికి అత్యవసర సేవలు అందించటానికి కాథ్ ల్యాబ్‌ను ప్రారంభించామని డాక్టర్ జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ పట్టణంలోని మెడిసిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. మేడ్చల్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర విధానాలు పత్తి రైతులకు వ్యతిరేకం

కొడంగల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలు పత్తి ఉత్పత్తిదారుల జీవనోపాధికి వినాశకరంగా మారాయని, పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేసే నోటిఫికేషన్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ దీపక్‌శ్యామ్సన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబ్యానాయక్, శంకర్‌నాయక్, లోక్యానాయక్, మోహన్‌నాయక్, జైపాల్, శివకుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

'స్థాయిని మించి మాట్లాడడం సరికాదు'

కోట్‌పల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థాయిని మించి బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం బీఆర్‌ఎస్ నిర్వహించిన ధర్నాలో కొందరు నాయకులు ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మళ్లీ పునరావృతం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంచంద్‌రెడ్డి(టిల్లు), బందయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, శివానందం పాల్గొన్నారు.

గణపయ్యకు ఘనమైన పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఊరూవాడా వెలిసిన మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు లంబోదరుడిని దర్శించుకొని పూజలు చేశారు. పలు చోట్ల గీతాపారాయణం, అన్నదానాలు చేశారు. వినాయక నిమజ్జనాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చెరువులు, కుంటల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 3


పెద్దేముల్: పూజలు నిర్వహిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దారాసింగ్


వికారాబాద్: గణనాథుడికి నిలువెత్తు లడ్డూ ప్రసాదం


కీసర రూరల్: పూజలు చేస్తున్న నాయకులు


బషీరాబాద్: గణపయ్య పూజలో భక్తులు

ఎఫ్‌టీఎల్‌లో అక్రమ లేఅవుట్

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 3.04 ఎకరాల స్థలంలో 2019లో లేఅవుట్ చేశారు. అప్పట్లోనే ఇది అక్రమ లేఅవుట్ అని ఆనాటి మున్సిపల్ కమిషనర్ ప్లాట్ల హద్దురాళ్లను తొలగించి అనుమతి లేకుండా లే అవుట్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండటంతో లేఅవుట్‌కు అనుమతి వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో అక్రమార్కులు మరో దారి వెతుక్కున్నారు. పాత తేదీలతో మృతి చెందిన సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి లేఅవుట్ కాపీని రూపొందించారు. వెనువెంటనే ప్లాట్ల అమ్మకాలు సైతం పూర్తి చేశారు. ఆ వెంటనే 2020 లో కురిసిన భారీ వర్షానికి చెరువు నిండి అలుగు పారడంతో అంకుషాపూర్ రోడ్డు వరకు నీళ్లు చేరాయి. దీంతో కొంతకాలం పనులను నిలిపివేశారు. ఉన్నట్టుండి తిరిగి పనులు చేపట్టారు.

అమాయకులకు అంటగట్టి..

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీ నగర్ - అంకుషాపూర్ రోడ్డులోని పులిచర కుంట ఎఫ్‌టీఎల్‌లో రుపొందించిన లేఅవుట్‌లో ప్లాట్ల క్రయ విక్రయాలు జరిగిపోవడంతోపాటు రిజిస్ట్రేషన్లు సైతం జరిగిపోయాయని పలువురు రియల్టర్లు వివరిస్తున్నారు. కాగా, ఉన్నట్టుండి ఇటీవల లేఅవుట్ చేసిన స్థలంలో ప్లాట్ల కు హద్దురాళ్లను పాతడం ప్రారంభించారు. ప్లాట్లు కొనుగోలు చేసింది నగరవాసులు కనుక వారికి పెద్దగా తెలియక చెరువు స్థలంలోని ప్లాట్లు కొని నిండా మునిగారు. ప్రస్తుతం చెరువు 30 శాతమే నిండింది. ఎగువన నీరు లేక పోవడంతో లేఅవుట్ పనులు తిరిగి చేపట్టారు. చెరువులో ప్లాట్లు చేయడం వలన భవిష్యత్తులో నిర్మాణ అనుమతులు వచ్చే అవకాశం లేదు. దీనికి తోడు హైడ్రా ఎప్పుడు కూల్చివేతలు చేపడుతుందో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పులిచర కుంటలో చెరువులో లేఅవుట్ చేసి పలువురికి ప్లాట్లు విక్రయించి మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో హద్దులు ఏర్పాటు చేస్తాం



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని పులిచర కుంట చెరువుకు ఎఫ్‌టీఎల్ పరిధికి హద్దులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు, తహసీల్దార్‌కు సమస్యను వివరించి చెరువులో పనులు చేపట్టకుండా చర్యలు తీసుకుంటాం.

- పరమేశ్, ఏఈ ఇరిగేషన్

క్రమబద్ధీకరణపై ఆశలు

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి సమస్యలు లేని దరఖాస్తులను పరిశీలనకు ఉంచిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించే అంశంలో ఉన్న అడ్డంకులను పరిష్కరించేలా చర్యలు తీసుకోలేకపోయారు. ధరణి పోర్టల్‌లో ఇందుకు సంబంధించి ప్రత్యేక ఆప్షన్ కల్పించకపోవడంతో సాదాబైనామాల క్రమబద్ధీకరణ, పట్టాపాస్ పుస్తకాల జారీ చేయడం సాధ్యం కాలేదు.

మార్గదర్శకాలు జారీ కాగానే..

రైతులు, భూయజమానుల హక్కుల రక్షణ, భద్రత కల్పించే విధంగా భూభారతి చట్టాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల్లో క్రమబద్ధీకరణకు అర్హత కలిగిన వాటికి చట్టబద్ధత కల్పించేందుకు భూ భారతి కొత్త చట్టంలో సెక్షన్ -6తో మార్గం సుగమమైంది. విచారణాధికారిగా ఆర్డీవోలకు ఈ బాధ్యతలు అప్పగించారు. తెల్ల కాగితాలపై రాసుకున్న భూ కొనుగోళ్ల ఒప్పందాలను క్రమబద్ధీకరించేందుకు భూమి కొనుగోలు, అమ్మకందారులకు విచారణకు హాజరు కావాలంటూ ఆర్డీవో నోటీసులు జారీ చేస్తారు. దరఖాస్తుదారులు అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది. ఆర్డీవో క్షేత్రస్థాయికి వెళ్లి భూములను పరిశీలించి స్థానిక రైతుల వాంగ్మూలం తీసుకుంటారు. సాదాబైనామా నిజమా .. కాదా.. అనేది నిర్ణయం తీసుకోనున్నారు. ఎవరి నుంచి అభ్యంతరాలు రాకపోతే క్రమబద్ధీకరణకు మార్గం సుగమవుతుంది. పట్టాదారు కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే మాత్రం విచారణ జరిపించనున్నారు. అభ్యంతరాలు వ్యక్తమైతే ఇంతకు ముందు పొలం సరిహద్దుల్లో ఉండే రైతుల వాంగ్మూలం నమోదు చేసుకుని ఫారం-8 నోటీసులు జారీ చేసి సమగ్ర విచారణ జరిపించి నిబంధనల మేరకు అర్హులకు పట్టా జారీ చేసేవారు. సాదాబైనామా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న భూమి సీలింగ్, అసైన్డ్, షెడ్యూల్డ్ ఏరియా చట్టాల పరిధిలోకి రానిది ఉంటేనే క్రమబద్ధీకరిస్తారు. దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసిన 90 రోజుల్లోపు ఈ ప్రక్రియ అంతా పూర్తి చేయాల్సి ఉంటుంది.